
సాక్షి నిజామాబాద్

సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



అప్రమత్తతతోనే..

జిల్లాలో అగ్ని ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఎండాకాలంలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశాలున్నాయి.

- 8లో ▸



మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే..

ఆరోగ్య సంరక్షణను అశ్రద్ధ చేసి అనర్థాన్ని కొనితెచ్చుకోవద్దని, ఆరోగ్యంగా ఉండడం మీ చేతుల్లోనే ఉందంటున్నారు వైద్యులు.

- 8లో ▸

వాతావరణం


గరిష్టం/కనిష్టం 40.2 / 19.4

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణంలో తేమ తక్కువగా ఉంటుంది. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆలయ శిఖరానికి పూజలు

- ఎస్సారెస్పీ నీటిలో నుంచి తేలిన కుస్తాపురం ఆలయ శిఖరం



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ నీటి మట్టం తగ్గుతుండడంతో కుస్తాపురం రామలింగేశ్వర స్వామి ఆలయ శిఖరం తేలింది. డొంకేశ్వర్ మండలం చిన్నయానం బ్యాక్ వాటర్ ప్రాంతంలో ఉన్న ఈ ఆలయం కొన్నేళ్లుగా ముంపులోనే ఉంది. చివరిసారిగా 2019లో గుడి పూర్తిగా తేలగా ఇప్పటి వరకు బయటపడలేదు. నీటి మట్టం తగ్గగా ప్రతి ఏడాది మే నెలలో గుడి శిఖరం తేలేది. కానీ, ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలోనే బయటపడింది. ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా జీజీ నడ్కుడకు చెందిన చిన్న గంగారాంతోపాటు మరికొందరు జాలర్లు తెప్పపై నీటిలో రెండు కిలోమీటర్లు ప్రయాణించి గుడి శిఖరం వద్దకు చేరుకున్నారు. శిఖరానికి సున్నం వేసి కొబ్బరియలు కొట్టి పూజలు నిర్వహించారు.

వేగంగా తగ్గుతున్న నీటిమట్టం



బాల్కొండ: కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతుండటంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. ఎండల తీవ్రత పెరగడంతో నీరు భారీగా ఆవిరవుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1062.80(13 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉంది.

నేటి నుంచి ఎస్సెస్సీ మూల్యాంకనం

నిజామాబాద్ అర్బన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభం కానున్నది. అందుకు సంబంధించిన ఏర్పాట్లను విద్యాశాఖ అధికారులు పూర్తి చేశారు. నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో ఎస్సెస్సీ మూల్యాంకనం జరగనుంది. రెండు లక్షలకు పైగా జవాబుపత్రాలను మూల్యాంకనం చేయనున్నారు. అందుకోసం 631 మంది ఏఈలు, 222 మంది స్పెషల్ అసిస్టెంట్లు, 104 మంది సీఈలను నియమించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జవాబుపత్రాల మూల్యాంకనం కొనసాగనుంది.

సాటాపూర్ రైల్వేగేటు మూసివేత

ఎడపల్లి(బోధన్): మండలంలోని సాటాపూర్ రైల్వేగేటును సోమవారం నుంచి తాత్కాలికంగా మూసి వేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతులు, అభివృద్ధి పనుల్లో భాగంగా గేటును మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. పనులు పూర్తయిన తరువాత యథావిధిగా వాహనాల రాకపోకలు సాగించవచ్చని తెలిపారు. కాగా, ముందస్తు సమాచారం లేకుండా ఆదివారమే గేటు మూసివేయడంతో ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. దీంతో గేటును తీశారు.

రాష్ట్ర నెట్‌బాల్ సంఘంలో జిల్లా వాసులు



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఆదివారం రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో జిల్లా కార్యవర్గ సభ్యులకు పలు పదవులు దక్కాయి. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావు(తిర్మన్‌పల్లి పాఠశాల పీడీ), రాష్ట్ర జాయింట్ సెక్రటరీలుగా ఎ రమేష్(జన్నెపల్లి పాఠశాల పీడీ), రఘురాం(హస్గుల్ పాఠశాల పీడీ)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఖిల్లా రామాలయంలో తాళిబొట్టును చూపుతున్న పండితుడు.. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సుభాష్‌నగర్ రామాలయంలో తలంబ్రాలు పోస్తున్న పూజారి



భక్తలోకం మురిసే..

కనుల పండువగా జగదభిరాముడి కల్యాణం

జగదభిరాముడి కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించిన భక్తలోకం తన్మయత్వంతో మురిసిపోయింది. జిల్లా వ్యాప్తంగా శ్రీరామ నవమి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఖిల్లా, సుభాష్‌నగర్ రామాలయాలతోపాటు బదారాం మందిర్, అయోధ్యనగర్ కోదండరామాలయం, సారంగాపూర్‌లోని హరిహరాత్మక బాలకరామ్ రామానంద ఆశ్రమంతోపాటు ఆలయాల్లో జిల్లా వ్యాప్తంగా నవమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. జైశ్రీరాం నినాదాలతో ఆలయాల పరిసరాలు మారుమోగాయి. సాయంత్రం నిర్వహించిన శోభాయాత్రల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

లొద్దిరామన్న కల్యాణం..



కల్యాణంలో పాల్గొన్న మహేశ్ కుమార్ గౌడ్, సునీల్‌రెడ్డి కుటుంబాలు

మోర్తాడ్(బాల్కొండ): భీమ్‌గల్ మండలం పిప్రి అటవీ ప్రాంతంలోని లొద్ది రామన్న ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ రెడ్డి దంపతులు వేడుకల్లో పాల్గొన్నారు. మహేశ్ కుమార్‌గౌడ్ దంపతులు కల్యాణోత్సవానికి తలంబ్రాలు సమర్పించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, వినయ్‌రెడ్డి, నరాల రత్నాకర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాలకు నిధులు

రహత్‌నగర్‌లో కాశీమాత, లలిత మాత ఆలయాల నిర్మాణం కోసం రూ.50లక్షల ప్రొసీడింగ్‌లు అందజేయడంతోపాటు లొద్ది రామాలయ అభివృద్ధి కోసం సొంతంగా రూ.2లక్షల నగదును మహేశ్‌కుమార్‌గౌడ్ అందజేశారు. అలాగే రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు.

సీఎంను డిచ్‌పల్లి ఖిల్లాకు తీసుకొస్తా..



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): చారిత్రక డిచ్‌పల్లి ఖిల్లా రామాలయానికి సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలో తీసుకొస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న అనంతరం డిచ్‌పల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సుద్దులం వద్ద మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపనకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని, అదే సమయంలో సీఎంను రామాలయానికి తీసుకువస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఎకో టూరిజంలో భాగంగా రామాలయం వద్ద పార్కు, పక్కనే ఉన్న చెరువులో బోటింగ్, గుట్టపై ఉన్న ఆలయం వరకు రోడ్డు సౌకర్యం కల్పించేందుకు టూరిజం శాఖకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ శాంతయ్య, బూస సుదర్శన్, మహేందర్‌రెడ్డి, రాములు, ఏజీ దాస్, నర్సారెడ్డి తదితరులున్నారు.

రాముని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలి



బాల్కొండ: కోండడ రాముని ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మెండోరా మండలం పోచంపాడ్‌లోని కోదండ రామాలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఎమ్మెల్యే సతీసమేతంగా పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని వేడుకున్నానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సొంత ఖర్చుతో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు.

వీకెండ్ డాక్టర్లు!?

నవీపేట్ మండలం నాళేశ్వర్‌కు చెందిన లక్ష్మి నరాల సంబంధిత సమస్యతో బాధపడుతూ గతేడాది డిసెంబర్ 30వ తేదీన నగరంలోని ఖలీల్‌వాడిలో ఉన్న విజయ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చింది. ఆ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకున్నా కాంపౌండర్‌లు రూ.400 ఫీజు వసూలు చేసి, తాను సూచించిన టెస్టులు చేయించుకుని రావాలని చీటీ ఇవ్వడంతో ఆమె విస్తుపోయింది. డాక్టర్ చూడకుండానే టెస్ట్‌లు ఎందుకు చేయించుకోవాలని ప్రశ్నించగా, ఆమెను బయటికి గెంటేసే ప్రయత్నం చేశారు. దీనిపై లక్ష్మితోపాటు ఆమె కుటుంబ సభ్యులు వైద్యారోగ్యశాఖ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

కాంపౌండర్‌కు కాదేదీ అసాధ్యం!

- డాక్టర్లు స్థానికంగా లేనిసమయంలో అంతా వారే..
- సూపర్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో వైద్యం చేస్తున్న వైనం



కంటి వైద్య నిపుణుడు కృష్ణమూర్తి మూడు రోజులపాటు అందుబాటులో లేకున్నా ఆయనకు చెందిన శ్రీరామ, గిరిజ నేత్ర వైద్యశాలల్లో రోగులకు ఏ ఆటంకం లేకుండా చికిత్స కొనసాగింది. కాంపౌండర్లే ఒక్కో రోగి వద్ద రూ.350కిపైగా వసూలు చేస్తూ టెస్టులు రాస్తూ వైద్యం అందిస్తున్నారని వైద్యారోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో శనివారం రాత్రి వైద్యారోగ్యశాఖ అధికారులు రెండు ఆస్పత్రుల్లో తనిఖీలు చేశారు.

నిజామాబాద్ నాగారం: కాంపౌండర్లు వీకెండ్ డాక్టర్లుగా చలామణి అవుతున్నారు. సాధారణ ఆస్పత్రుల నుంచి సూపర్, మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రుల వరకు వారిదే హవా కొనసాగుతోంది. 'వైద్యుల తరువాత వైద్యులంతటి వారమని అనుకుంటున్నారో.. మేము లేని సమయంలో మీరే అని డాక్టర్లు భరోసా ఇస్తున్నారో తెలియదు' కానీ కాంపౌండర్లు రెచ్చిపోతున్నారు. రోజుల తరబడి డాక్టర్లు అందుబాటులో లేకున్నా రోగులకు వారే వైద్యం చేస్తున్నారు. శని, ఆదివారాలు, పండగ రోజుల్లో, టూర్లకు వెళ్లినప్పుడు ఆస్పత్రులను అన్నీ తామై నడుపుతున్నారు. ఓపీ ఫీజు నుంచి టెస్టులకు రిఫర్ చేయడం, మందులు రాయడం, ఇన్‌పేషెంట్లుగా అడ్మిట్ చేసుకోవడం చేస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లా కేంద్రంలో వెలుగుచూసిన ఘటనలు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వహణ తీరును ఎత్తిచూపాయి. జిల్లా కేంద్రంలోనే 300 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉండగా, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ తదితర ప్రాంతాల్లో 50 వరకు ఉన్నాయి. హైదరాబాద్ నగరం దగ్గరగా ఉండడం, చాలా మంది డాక్టర్లు తమ ఫ్యామిలీలను అక్కడే ఉంచడంతో సాధారణంగానే శని, ఆదివారాల్లో వెళ్తుంటారు. ఆ రోజుల్లో ఏ ఆస్పత్రిలోనూ 'డాక్టర్ అందుబాటులో లేరు' అనే బోర్డు మాత్రం కనిపించదు. ఒక్కో వైద్య నిపుణుడైతే వృత్తిపరమైన కాన్ఫరెన్స్ లు, టూర్లకు రోజులతరబడి వెళ్లినా ఇక్కడ మాత్రం వైద్య సేవలందుతున్నాయి. రోజులతరబడి వెళ్లే కొంతమంది తమ స్థానంలో ఇతర వైద్యులను ఉంచి వెళ్తుండగా, వీకెండ్స్‌కు వెళ్లే వారు మాత్రం కాంపౌండర్లకు వదిలేసి వెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. డాక్టర్ అందుబాటులో ఉన్నదీలేనిదీ ఆస్పత్రుల సిబ్బంది రోగులకు చెప్పకపోగా ఓపీ రాసేసి టెస్ట్‌లకు రిఫర్ చేస్తుండడం గమనార్హం. ఇదే అదనుగా పలు ఆస్పత్రుల కాంపౌండర్లు రోగులను టెస్టులు, మందుల పేరుతో దోచుకుంటున్నారు. ల్యాబ్‌లు, మెడికల్‌లు, స్కానింగ్‌సెంటర్ల నిర్వాహకులతో కలిసి తమ స్టైల్‌లో 'వీకెండ్' దందా చేస్తున్నారు.

ఫిర్యాదు అందగానే హడావుడి

ప్రైవేట్ ఆస్పత్రులపై ఫిర్యాదులు అందిన సమయంలో హడావుడి చేస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు ఆ తరువాత చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మామూలు రోజుల్లోనే పర్యవేక్షణ లేదని.. ఇక వీకెండ్‌లో పట్టించుకునే వారెవరని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులపై ఫిర్యాదులు, ఆరోపణలు వ్యక్తమవుతున్నా అటువైపు కన్నెత్తి చూడడం లేదంటున్నారు. వైద్యారోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ పక్కాగా ఉంటే తమ డబ్బులు ఆదా కావడంతోపాటు మెరుగైన వైద్య అందుతుందని అంటున్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి బీజేపీ కృషి



పార్టీ ఆవిర్భావ వేడుకలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, జిల్లా అధ్యక్షుడు దినేశ్, నాయకులు

- ఎదురులేని శక్తిగా పార్టీ ఎదిగింది
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

సుభాష్‌నగర్: అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. భారతదేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టాలన్న శ్యామప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ జీ ఆశయాలు సాధిద్దామని పిలుపునిచ్చారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులాచారి అధ్యక్షతన నగరంలోని కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. ఏడు దశాబ్దాల నుంచి ఎందరో మహనీయుల జీవితాల త్యాగఫలంతోనే బీజేపీ రాజకీయంగా ఎదురులేని శక్తిగా ఎదిగిందన్నారు. పదేళ్లలో ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక విప్లవాత్మక విజయాలు సాధించిందన్నారు. బీజేపీ నాయకుల పార్టీ కాదని.. కార్యకర్తల పార్టీ అని దినేశ్ పటేల్ కులాచారి అన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, స్రవంతి రెడ్డి, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ హాకీ టోర్నీకి ఎంపిక



నిజామాబాద్‌నాగారం: ఒడిశా రాష్ట్రంలో సోమవారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహించనున్న ఆలిండియా పోలీస్ హాకీ టోర్నీకి జిల్లాకు చెందిన కానిస్టేబుళ్లు ఎంపికయ్యారు. కానిస్టేబుళ్లు అరవింద్, సురేశ్(ఎల్లారెడ్డిపల్లి), బదావత్ మహిపాల్(తూంపల్లి) రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించనున్నారు. హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగారెడ్డి, రమణతోపాటు హాకీ క్రీడాకారులు కానిస్టేబుళ్లకు అభినందనలు తెలిపారు.

హెచ్‌సీయూపై మాట్లాడటం విడ్డూరం

- వేలాది ఎకరాల భూములను ధారాదత్తం చేసిన బీఆర్‌ఎస్
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్

ఆర్మూర్‌టౌన్: బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో విలువైన 20వేల ఎకరాల ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ)కి సంబంధం లేని భూములపై రాద్ధాంతం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ మండిపడ్డారు. ఆర్మూర్ పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల ప్రభుత్వ భూములు ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేశారని, అందుకు హైదరాబాద్‌లో వెలసిన బహుళ అంతస్తుల భవన నిర్మాణాలే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జీ మీనాక్షి నటరాజన్ హెచ్‌సీయూ విద్యార్థులు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీతో చర్చలు జరిపి సముచిత నిర్ణయం తీసుకుంటారని అన్నారు. ఆర్మూర్ నవనాథ సిద్దుల గుట్టను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. అవసరమైతే సీఎం రేవంత్ రెడ్డిని గుట్టకు తీసుకొస్తానని తెలిపారు. సమావేశంలో ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మార చంద్రమోహన్, ఏఎంసీ చైర్మన్ సాయిబాబాగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్‌ రూరల్‌: నగరంలో ఆదివారం సంస్కార భారతి ఇందూరు మహానగర కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజ్‌ కుమార్‌ సుబేదార్‌, ఉపాధ్యక్షులుగా సముద్రాల శ్రీనివాసచారి, మోహన్‌రెడ్డి, బున్ని మల్లేష్‌, జయప్రద, చిరంజీవాచారి, ప్రధాన కార్యదర్శిగా పెండం కార్తీక్‌, కార్యదర్శులు వినోద్‌గౌడ్‌, వరలక్ష్మి, రమణాచారి, నితీష్‌ మలాని, పవన్‌ కుమార్‌, కోశాధికారిగా రాధాకృష్ణ, మాతృశక్తి కన్వీనర్‌గా మాధురి, ప్రచార ప్రముఖ్‌గా బెజుగం శ్రీకాంత్‌, కళావిభాగ్‌ కన్వీనర్‌గా ఎన్‌. రవికుమార్‌, దృశ్యకళా విభాగ్‌ కన్వీనర్‌గా పాముల నవీన్‌, లోపు కళా విభాగ్‌ కన్వీనర్‌గా తోట ప్రశాంత్‌, సాహిత్య కళ విభాగ్‌ కన్వీనర్‌గా శ్రీమన్నారాయణచారి, విరాట్‌ కళా ధరోహర్‌ విభాగ్‌ కన్వీనర్‌గా పురుషోత్తమాచారి, కార్యవర్గ సభ్యులుగా కళ్యాణి, రచనా, రజిని, సాయిరెడ్డి, శివ, నాగమణి, రాము, శ్రీనివాస్‌ రెడ్డి, సముద్రాల మధుసూదనాచారి ఎన్నికయ్యారు. ప్రాంత సంఘటన్‌ మంత్రి నిరంజన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్‌ మ్యాచ్‌ ప్రదర్శనకు భారీ స్పందన



నిజామాబాద్‌ నాగారం: నగరంలోని ఉమెన్స్‌ కళాశాల మైదానంలో ఆదివారం జిల్లా క్రికెట్‌ అసోసియేషన్‌, టాటా ఆధ్వర్యంలో ఐపీఎల్‌ క్రికెట్‌ లైవ్‌ మ్యాచ్‌ను ప్రొజెక్టర్‌ ద్వారా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు క్రికెట్‌ అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. అధిక సంఖ్యలో జిల్లావాసులు తరలివచ్చి మ్యాచ్‌ను తిలకించారు.

అప్రమత్తతతోనే నివారణ

- జిల్లాలో ప్రతియేటా పెరుగుతున్న అగ్నిప్రమాద ఘటనలు
- రూ.లక్షల్లో నష్టం సంభవిస్తున్న వైనం

ఖలీల్‌వాడి: జిల్లాలో అగ్ని ప్రమాదాల సంఖ్య ప్రతియేడాది పెరుగుతునే ఉన్నాయి. ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉండటంతో ఈ కాలంలో అగ్నిప్రమాదాలు అధికంగా జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఘటనల్లో వల్ల రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. పలు సందర్భాల్లో ప్రాణనష్టం కూడా జరుగుతుంది. ప్రమాదాలను నివారించడానికి అప్రమత్తతే ముఖ్యమని పలువురు పేర్కొంటున్నారు. జిల్లాలో అపార్ట్‌మెంట్‌లు, ఆస్పత్రులు, దుకాణ సముదాయాల సంఖ్య పెరిగిపోతున్నాయి. కానీ వీటి యాజమాన్యాలు అగ్నిప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడం లేదు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్‌ సిబ్బంది ఇచ్చిన సూచనలు తప్పక పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో ఏడు ఫైర్‌ స్టేషన్లు

ప్రమాదాలను నివారించడానికి అగ్నిమాపకశాఖ అప్రమత్తంగా ఉంటోంది. జిల్లాలో ఏడు ఫైర్‌ స్టేషన్‌లో ఉన్నాయి. దీంతో ప్రమాదాలు సంభవించిన సమయంలో ఫైర్‌ సిబ్బంది వెంటనే ఫైరింజన్‌తో ఘటన స్థలాలకు వెళ్లి మంటలను ఆర్పివేయడానికి కృషి చేస్తున్నారు. జిల్లాలో నందిపేట్‌, బాల్కొండ ఫైర్‌ స్టేషన్‌లు కొత్తగా ఏర్పాటు చేశారు. నిర్లక్ష్యంతో పాటు అవగాహన లేకపోవడంతో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిపై అవగాహన ఉంటే 80నుంచి 90శాతం వరకు ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుందని వారు పేర్కొంటున్నారు.



పూలాంగ్‌ వద్ద సామిల్‌లో అంటుకున్న మంటలు (ఫైల్‌)

ఇటీవల జరిగిన ప్రమాదాలు..

- జిల్లా కేంద్రంలోని పూలాంగ్‌ చౌరస్తా వద్ద ఉన్న రెండు సామిల్‌ల్లో శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. వెంటనే స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో 4 ఫైరింజన్లు ఘటన స్థలానికి చేరుకొని మంటలను అర్పివేశాయి. ఈఘటనలో సుమారు రూ.20 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.
- జిల్లా కేంద్రంలోని మార్కండేయ గుడి పక్కన ఫిబ్రవరి 11న ఓ పెంకుటిల్లులోని పూజ గదిలో దీపంతో పక్కన ఉన్న వస్తువులకు మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలు అర్పివేశారు. ఇంట్లోని నగదు, బంగారం కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. ఇవే కాకుండా జిల్లావ్యాప్తంగా చాలా చోట్ల ఇటీవల అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనల్లో పలువురు సర్వస్వం కోల్పోయి, నిరాశ్రయులుగా మారారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- దుకాణాలలో మండే స్వభావం ఉన్న వస్తువులను పెట్టవద్దు.
- ఇంట్లో ఉండే సిలెండర్‌లకు వేడి తగలకుండా జాగ్రత్తలు పాటించాలి.
- దుకాణాలు, ఇళ్లలో విద్యుత్‌ తీగలను ఎలుకలు కొరకకుండా జాగ్రత్తలు చేపట్టాలి. అలాగే కరెంట్‌వైర్లు ఒకేచోట ఎక్కువగా ఉంచకుండా, వదులుగా ఉండేలే చర్యలు చేపట్టాలి.
- ఇళ్ల, దుకాణాల్లో వెంటిలేషన్‌ సరిగా ఉండాలి.
- అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు అగ్నిమాపక వాహనాలు తిరిగే విధంగా ఉండాలి. అలాగే అన్ని ఫ్లాట్‌లకు నీరు అందేలా పైపులైన్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- పంటపొలాల్లో వ్యర్థాలకు నిప్పుపెట్టవద్దు.

సంవత్సరాల వారీగా ప్రమాదాలు

సంవత్సరం	ప్రమాదాలు	ఆస్తినష్టం	ప్రాణనష్టం
2023	252	రూ.4.28 కోట్లు	9
2024	228	రూ.2.78 కోట్లు	21
2025(మార్చ్)	80	రూ.80లక్షల వరకు	1

జిల్లాలోని ఫైర్‌ స్టేషన్ల నంబర్లు

నిజామాబాద్‌	8712699225
ఆర్మూర్‌	8712699229
భీమ్‌గల్‌	8712699223
బాల్కొండ	8712685797
నందిపేట్‌	8712685799
ఇందల్వాయి	8712699231
బోధన్‌	8712699227

వెదురుబొంగుల షాపులో అగ్నిప్రమాదం

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఓ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వర్ని చౌరస్తా వద్ద ఓ వెదురు బొంగుల షాపులో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్‌ సీఐ ప్రసాద్‌ అక్కడి చేరుకుని ఫైర్‌ సిబ్బందికి సమాచారం అందించారు. రెండు ఫైర్‌ ఇంజిన్లు ఘటన స్థలానికి చేరుకోగా, ఫైర్‌ ఆఫీసర్‌ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అర్పివేశారు. షార్ట్‌ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు, సుమారు రూ.10లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు.



జాగ్రత్తలు పాటించాలి

అగ్నిప్రమాదాలపై ఫైర్‌ సిబ్బంది ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా వ్యవహరించాలని ప్రయోగాత్మకంగా వివరిస్తున్నాం. ఇండ్రస్టీస్‌ల యాజమాన్యాలు, పెద్ద హోటళ్లు, ఆస్పత్రుల నిర్వాహకులకు, అక్కడ పని చేసే సిబ్బందికి పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నాం. ఫైర్‌ సేఫ్టీకి సంబంధించిన ఎన్‌వోసీ తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలి.


– నర్సింగ్‌రావు, ఫైర్‌ ఆఫీసర్‌, నిజామాబాద్‌

మీ ఆరోగ్యం.. మీ చేతుల్లోనే..

- దురలవాట్లకు దూరంగా ఉండాలి
- ఫిట్‌నెస్‌పై ఫోకస్‌ పెట్టాలి
- నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

నిజామాబాద్‌నాగారం: ప్రస్తుతం అందరూ ఈజీ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. జంక్‌ఫుడ్‌ ఎక్కువగా తీసుకుంటూ శారీరక శ్రమకు దూరంగా ఉంటున్నారు. దీనికితోడు మొబైల్స్‌తో ఎక్కువగా గడుపుతుండటంతో ప్రజలు ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. అనారోగ్యాలకు గురికాకుండా ఆరోగ్యంగా ఉండాలంటే అది మీ చేతుల్లోనే ఉందంటున్నారు నిపుణులు. నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..

సమాజంలో చాలామంది ఆరోగ్యంపై అశ్రద్ధ వల్ల అనర్థాలను కొని తెచ్చుకుంటున్నారు. చిన్న వయస్సులోనే రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా మందు, సిగరెట్‌, గుట్కా, గంజాయి, డ్రగ్స్‌ వంటివి సేవిస్తూ ఎంజాయ్‌ చేస్తూ, ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారు. అలాగే కొందరు ఒత్తిడితో కూడా రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుత కాలంలో బీపీ, షుగర్‌ వయస్సుతో సంబంధం లేకుండా వస్తుంది. జన్యుపరమైన రోగాలు చిన్న చిన్న పిల్లలో కూడా వస్తున్నాయి. ఆహారపు అలవాట్లలో తేడాలు రావడంతో క్యాన్సర్‌ బారిన పడుతున్నారు. ప్రతి ఏడాది వరల్డ్‌ హెల్త్‌ ఆర్గనైజేషన్‌ (డబ్ల్యూహెచ్‌వో) ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య విషయాలపై నివేదిక విడుదల చేస్తుంది. ఈ ఏడాది మహిళల్లో వచ్చే అనారోగ్య సమస్యలు బ్రెస్ట్‌క్యాన్సర్‌, సర్వేకల్‌ క్యాన్సర్‌, పిల్లలో వచ్చే సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టి పరిష్కరించాలని సూచించారు.



రెగ్యులర్‌ హెల్త్‌చెకప్‌ తప్పనిసరి



ప్రతిఒక్కరూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి. బీపీ, షుగర్‌ ఉంటే అప్రమత్తంగా ఉండాలి. ఒత్తిడికి గురికావద్దు. ప్రతినిత్యం వ్యాయామం చేయాలి. ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. వయస్సుతో సంబంధం లేకుండా రోగాలు వస్తున్నాయి. అందుకే రెగ్యులర్‌గా హెల్త్‌ చెకప్‌ చేయించుకోవాలి.

– చిటిమెల్ల సంతోష్‌కుమార్‌, జనరల్‌ ఫిజీషియన్‌, ఎండీ

ఆరోగ్యం కోసం జాగ్రత్తలు

- 6నెలలకు ఒకసారి హెల్త్‌ చెకప్‌ తప్పనిసరి
- సిగరెట్‌, మద్యపానం, గుట్కా, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
- ప్రతినిత్యం వ్యాయామం చేయాలి. అరగంట పాటు వాకింగ్‌ చేయాలి
- జంక్‌ఫుడ్‌కు, హోటల్స్‌ ఫుడ్‌కు దూరంగా ఉండాలి
- ఉప్పు వాడకాన్ని తగ్గించాలి
- వంశపారంపర్యంగా వచ్చే క్యాన్సర్‌, హార్ట్‌ సమస్యలకు చికిత్స తీసుకోవాలి.
- బీపీ, షుగర్‌ ఉంటే మరింత జాగ్రత్తలు పాటించడం అవసరం
- ఒత్తిడి విషయంలో అప్రమత్తంగా ఉండాలి

రసవత్తరంగా కుస్తీ పోటీలు



కోటగిరిలో కుస్తీపోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

రెంజల్‌(బోధన్‌): మండలంలోని కందకుర్తి గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆదివారం నిర్వహించిన కుస్తీపోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలకు మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరి కుస్తీకి పది తులాల వెండి కడియం, ద్వితీయ కుస్తీకి ఐదు తుల వెండి కడియాన్ని విజేతలకు అందించారు. మాజీ సర్పంచ్‌ ఖలీమ్‌బేగ్‌, మాజీ ఉప సర్పంచ్‌ యోగేష్‌లు మల్లయోధులకు బహుమతులను అందజేశారు.

రుద్రూర్‌: కోటగిరి మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కుస్తీపోటీలు నిర్వహించారు. కుస్తీ పోటీలకు వివిధ గ్రామాల నుంచి మల్లయోధులు తరలివచ్చి హోరాహోరీగా తలపడ్డారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

వర్ని: మండలంలోని గోవూరు గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలను నిర్వహించారు. పోటీలలో పాల్గొనటానికి చుట్టుపక్కల గ్రామాల మల్లయోధులు, మహారాష్ట్రకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.



కందకుర్తిలో కుస్తీపోటీల విజేతలకు వెండి కడియాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

రాములోరి దర్శనానికి పోటెత్తిన భక్తులు

జిల్లాకేంద్రంలోని ఖిల్లా రామాలయం, సుభాష్‌నగర్‌లోని రామాలయంలో ఆదివారం శ్రీరామవనమి వేడుకలను ఘనంగా చేపట్టారు. ఈసందర్భంగా ఆలయ ఆవరణల్లో సీతారాముల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వేడుకలకు భక్తులు భారీగా హాజరై, స్వామివార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సీపీ సాయిచైతన్య, అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ వేడుకల్లో పాల్గొన్నారు. – సాక్షిఫొటోగ్రాఫర్‌, నిజామాబాద్‌



సుభాష్‌నగర్‌ రామాలయం బయట క్యూ కట్టిన భక్తులు



సుభాష్‌నగర్‌ రామాలయంలో సీపీ సాయిచైతన్యను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు



పెద్దరాంమందిరంలో దోలారోహణంలో పాల్గొన్న అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ, భక్తులు



ఖిల్లా రామాలయంలో భక్తుల క్యూ



పడగల్‌లో రథానికి జలాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మాచారెడ్డి: ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి సూచించారు. మాచారెడ్డి చౌరస్తాలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాచారెడ్డి చౌరస్తాలో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం విరాళాలు ఇచ్చిన గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సై అనిల్‌, సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్‌

బైక్‌ అదుపుతప్పి ఒకరి మృతి

మోర్తాడ్‌(బాల్కొండ): భీమ్‌గల్‌ మండలంలో బైక్‌ అదుపుతప్పడంతో ఒకరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జక్రాన్‌పల్లి మండలం కలిగోట్‌కు చెందిన గండికోట మహేష్‌(42) కొన్నేళ్ల నుంచి మోర్తాడ్‌లో ఒంటరిగా జీవిస్తున్నాడు. ట్రాక్టర్‌ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడు సొంత పనిపై ఆదివారం భీమ్‌గల్‌కు బైక్‌పై వెళ్లి, తిరిగి వస్తుండగా భీమ్‌గల్‌ మండలం జాగిర్యాల్‌ రోడ్డు మార్గంలో బైక్‌ అదుపుతప్పింది. దీంతో అతడు బైక్‌ పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడటంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి..



ఇందల్వాయి: జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లి ఎల్లమ్మ గుడి దగ్గర ఆదివారం ఒక గుర్తుతెలియని వ్యక్తి నిస్సహాయస్థితిలో ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని అతడిని నిజామాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 65 నుంచి 70ఏళ్ల లోపు ఉంటుందని, తెలుపు చొక్కా ధరించి ఉన్నాడన్నారు. ఎవరైనా అతడిని గుర్తిస్తే ఇందల్వాయి ఎస్సై ఫోన్‌ నంబర్‌ 8712659854, సీఐ ఫోన్‌నంబర్‌ 8712659851ను సంప్రదించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్‌: పోతంగల్‌ మండలం సుంకిని గ్రామంలో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం అందడంతో సుంకినికి వెళ్లగా రెండు ట్రాక్టర్లు పట్టుబడ్డాయన్నారు. వాటిని పోలీస్‌ స్టేషన్‌ తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు.

మహిళ అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని గొల్లవాడకు చెందిన కొట్టూరి లక్ష్మి అనే మహిళ అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈనెల 5న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు చాలా చోట్ల గాలించినా ఆమె ఆచూకీ దొరకలేదు. దీంతో ఆమె భర్త పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య



గంగారాం (ఫైల్‌)

నస్రుల్లాబాద్‌(బాన్సువాడ): మండలంలోని మైలారం గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై లావణ్య తెలిపిన వివరాలు ఇలా.. మైలారం గ్రామానికి చెందిన దూళి గంగారాం(73) చాలా రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. కొన్ని నెలల క్రితం ఎడమ కాలుకు గాయం కావడంతో షుగర్‌వ్యాధి కారణంగా నడవలేక పోయేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది శనివారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బీబీపేట మండలంలో..

బీబీపేట: మండలంలో ఇటీవల ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై ప్రభాకర్‌ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని తుజాల్‌పూర్‌ గ్రామానికి చెందిన కన్న బాల్‌రాజ్‌గౌడ్‌ (54)కు కొద్ది నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నొప్పి తగ్గలేదు. దీంతో అతడు జీవితంపై విరక్తి చెంది ఈనెల 5న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని గమనించి, వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రయివేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు సాయికృష్ణాగౌడ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బాల్‌రాజ్‌గౌడ్‌ (ఫైల్‌)

ఆరెపల్లిలో చోరీ

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరెపల్లిలో తాళం వేసిన రెండిళ్లలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. మాచారెడ్డి ఎస్సై అనిల్‌ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ఎర్రగొల్ల నడిపి సాయిలు శనివారం రాత్రి ఇంటికి తాళం వేసి, తన భార్యతో కలిసి అదే గ్రామంలో ఉంటున్న కొడుకు ఇంటికి వెళ్లి పడుకున్నాడు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళంతో పాటు బీరువా తాళం పగులగొట్టి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దుండగులు బీరువాలో ఉన్న మూడు తులాల బంగారం ఆభరణాలు, రూ.20 వేల నగదు దోచుకెళ్లినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. ఈమేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. అలాగే అదే గ్రామానికి చెందిన భువనగిరి రాజు ఇంటికి తాళం వేసి, ఊరెళ్లడంతో దుండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. కానీ చోరీ జరగలేదని పోలీసులు తెలిపారు.

బోధన్‌ పట్టణంలో..

బోధన్‌టౌన్‌: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలోని ఓ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. వెంకటేశ్వరకాలనీకి చెందిన ఈశ్వర్‌ దాస్‌ ఇంటికి తాళం వేసి, తన భార్యతో కలిసి ఈనెల 4న హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లాడు. ఆదివారం ఉదయం అతడి ఇంటి తలుపులు తెరచి ఉండటంతో స్థానికులు గమనించి ఈశ్వర్‌దాస్‌కు సమాచారం అందించారు. వెంటనే అతడు బోధన్‌కు వచ్చి ఇంట్లో చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బీరువాలో దాచిన 30 తులాల వెండి ఆభరణాలు, తులం బంగారం, రూ.30 వేల నగదు చోరీకి గురయ్యాయి. ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్‌ను సైతం దుండగులు ఎత్తుకెళ్లారని బాధితుడు తెలిపాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అనిల్‌

నవీపేటలో సైబర్‌ మోసం

నవీపేట: మండల కేంద్రంలో ఓ వ్యక్తి సైబర్‌ మోసానికి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై వినయ్‌ తెలిపిన వివరాలు ఇలా.. నవీపేట శివారులోని సాయికృప పెట్రోల్‌ బంక్‌లో ఈనెల 1న ఓ వ్యక్తి డీజిల్‌ పోయించుకొని, రూ.3370ను ఫోన్‌పే చేశాడు. కానీ ట్రాన్సక్షన్‌ ఫెయిల్‌ అయిందని క్యాషియర్‌ సైబా వెంకటేశ్వర్‌ సదరు వ్యక్తికి తెలిపాడు. డబ్బులు కట్‌ అయ్యాయని, త్వరలో వస్తాయని అతడు క్యాషియర్‌ను నమ్మించాడు. అనంతరం క్యాషియర్‌ ఫోన్‌కు ఓ వ్యక్తి కాల్‌ చేసి ఎస్‌బీఐ నుంచి మాట్లాడుతున్నట్లు తెలిపాడు. డబ్బుల కోసం ఒక ఫైల్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవాలని సూచించగా, వారు చెప్పిన విధంగా ప్రాసెస్‌ చేశాడు. కొద్దిసేపటికీ విడతల వారీగా అతడి అకౌంట్‌ నుంచి రూ.70వేలు డ్రా అయినట్లు మెసేజ్‌ వచ్చింది. దీంతో కాల్‌ చేసిన వారిని సంప్రదించడానికి ప్రయత్నించగా రిప్లయ్‌ రాలేదు. వెంటనే మోసపోయానని గుర్తించి, సైబర్‌క్రైమ్‌ నంబర్‌కు ఫోన్‌ చేసి ఫిర్యాదు చేశాడు. ఆదివారం పోలీసులకు ఫిర్యాద చేయగా వారు కేసు నమోదు చేసుకున్నారు.

న్యూసెన్స్‌ చేసిన యువకులపై కేసు నమోదు



ఎల్లారెడ్డి: పట్టణంలోని నడి రోడ్డులో శనివారం రాత్రి బర్త్‌డే పార్టీ పేరిట కేక్‌ కట్‌ చేస్తూ న్యూసెన్స్‌ క్రియేట్‌ చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్‌ తెలిపారు. రోడ్డుపై కేక్‌ కట్‌ చేసిన వారితోపాటు వారి తల్లిదండ్రులకు ఆదివారం కౌన్సెలింగ్‌ నిర్వహించారు. రోడ్డుపై న్యూసెన్సు చేస్తే కఠిన చర్యలుంటాయని, కేసులు నమోదు చేస్తామని ఎస్సై అన్నారు.